పసితనానికి ప్రపంచం తెలీదు. తల్లి పెగుకు తప్పొప్పులూ తెలీవు. అయితే, ఎవరు చేసిన తప్పుకు ఆ తల్లీ కొడుకులు గురయినట్టు?

సాయంత్రం అర్థయిదుగంట లయింది. డాక్టరు కరుణాకరంగారిల్లు ఆ పూట చాలాసందడిగా వుంది. వచ్చి మామిడాకుల తోరణాలతో పచ్చగా పసుపుపూసిన గుమ్మాలతో రకరకాలైన సిల్కు తెరలతో ఇల్లు కలకల లాడుతూంది. అప్పటి కప్పుడే ముత్తయిదువలు ఒక్కొక్కరే లోనికి వస్తున్నారు.

రంగు-రంగుల చీరలతో రకరకాల ఫేషన్లతో గాజుల గలగలలతో పూల సువాసనలతో హాలంతా గుమ్మున ముంచెత్తుతోంది. హాలులో పరచిన తివాసీలు చక్కని రంగులతో పసితనంతో చూడముచ్చటగా వున్నాయి. వచ్చిన ముత్తయిదువులు ఆ తివాసీలపై ఆసీను లవుతున్నారు.

పైన సీలింగ్‌ఫాను గిరగిరా తిరుగుతూ పక్షపాతం లేకుండా అందరకూ గాలిని సరఫరా చేస్తూంది. చక్కగా అలంకరించుకున్న మీనాక్షి (కరుణాకరంగారి భార్య) హాలు గుమ్మం ముందు నిలచి వచ్చినవారినందరినీ గౌరవంగా పలకరించి కూర్చోమని చెప్పుతున్నాది.

ఈ సందడి కంతటికీ కారణం డాక్టరు కరుణాకరంగారి అబ్బాయి పుట్టిన రోజు. మీనాక్షి కాపురానికి వచ్చిన పది సంవత్సరాలకు అపురూపంగా పుట్టాడు రఘు. రఘుకు నాలుగు సంవత్సరాలు నిండి అయిదవ సంవత్సరం ప్రవేశిస్తున్నది ఆ రోజు. కరుణాకరం మీనాక్షిగార్లకు పంచప్రాణాలు రఘు. అపురూపంగా పుట్టిన అబ్బాయి. అందులోనూ కలిగివున్న యింట్లో పుటి పెరుగుతున్న రఘుకు ముద్దుముచ్చట్లకు లోటేముంటి? వారి ముద్దుకు తగినట్లే రఘు చక్కగా బొద్దుగా వచ్చగా దబ్బపండువంటి శరీరచ్ఛాయతో, ఉంగరాలు తిరిగిన క్రాపుతో చూడముచ్చటగా వుంటాడు. ఎర్రని ముఖమల్ నిక్కరూ, తెల్లని క్రేపుసిల్కు షర్టూ వేసుకున్నాడు.


ఆరోజు త్వరగా డాక్టరుగారింటి పనిలోకి వచ్చింది గంగి. దాని వెనుకనే కొడుకు ఆరేళ్ళవాడు వెంటబడ్డాడు. గంగికి భర్త లేడు. రంగడు ఒక్కడే కొడుకు. తండ్రి లేని ఆ పిల్లవాణ్ని ప్రాణంగా పెంచుకుంటూ వస్తున్నది గంగి. ప్రేమగా చూడటమే తప్ప ఆలన పాలనచేసి ముద్దుముచ్చటలు తీర్చలేని పేదరాలు గంగి. ఒకపూట తిండి తాను తిని రెండుపూటలా పిల్లవాడికిపెట్టే శక్తిమంతురాలు గంగి. రంగడి వయస్సు ఆరు సంవత్సరాలు. పీలగా, నల్లగా నాలుగు సంవత్సరాల పిల్లాడివలె వుంటాడు రంగడు. జిడ్డోడుతున్న గుడ్డలతో చింపిరితలకాయితో చూడ అసహ్యంగా వుంటాడు. తల్లి సంపాదన తిండికే చాలదు. తిండికే ముఖం వాచి వున్న రంగడికి మంచి మంచి గుడ్డలు కట్టుకోవాలనీ రకరకాలుగా బజారుల్లో అమ్మే తినుబండారాలు కొనుక్కుని తినాలనీ అమితమైన ఆశ వుంది. కాని వాడికి జరిగే విధానంలేదు.

ఆరోజు అమ్మతో పేచీపెట్టుకుని మరీ వెంటవచ్చాడు రంగడు. తల్లి పనిచేస్తుంటే కూడావుండి, వెంటవెంటతిరుగుతూ, డాక్టరుగారి యింటి పరిసరాలన్నీ ఆశ్చర్యంగా చూస్తున్నాడు. యిల్లు వూడ్చుతుంటే కొంగు పటుకునే తిరిగాడు. హాలులో జరుగుతున్న సందడి చూసి గుమ్మం ప్రక్కగా ద్వారానికి అంటుకున్నట్లు నిలబడి పోయాడు రంగడు. దొడ్లో బోలెడన్ని అంట్లు పడివున్నాయి. ఇప్పటికి సగం పనైనా తెమలలేదని గంగి తొందరపడి అంట్లు తోమటానికి వెళ్తూ కొడుకును రమ్మంది.

"రా రా రంగా, దొడ్లో అంటగిన్నెలు తోమాల."

"ఊ.... ఉ, ఇక్కడ సూత్తానే అమ్మ."

తల్లి చేతిని విదిలిస్తూ హాలులోకే చూస్తున్నాడు రంగడు. "ఏమీ ముట్టుకోక్కు—లోనికి వెళ్ళమాకు—ఇక్కడే ఉండు." బుద్ధిచెప్పి చరచరా పనిలోకి పోయింది గంగి. పేరంటం హడావుడిచూస్తూ ద్వారబంధానికి బల్లిలా అంటుకుపోయాడు రంగడు. ఒక్కొక్క ముత్తయిదువ వచ్చి కుర్చీలో దర్జాగా కూర్చున్న రఘు తలపై అక్షతలు జల్లి ఆశీర్వచనంచేస్తూ, తమ శక్తికొద్ది తెచ్చిన కానుకలను చేతులో పెడుతున్నారు. రఘుప్రక్కగా పెద్దటేబులు అమర్చివుంది. ఆ బల్లంతా కానుకలతో నిండిపోయింది.



# ఎర్రలాగూ తెల్లచొక్కా

ముదుంపాక ఉమాదేవి

పేరంటాళ్ళందరూ వెళ్ళారు. రఘు పక్కడూ కుర్చీలో కూర్చుని కోవాబిళ్ళలు తింటున్నాడు. మీనాక్షి ముత్తయిదువలను సాగనంపటానికి హాలుదాటి బైటగుమ్మం వద్దకు వెళ్ళింది. రఘు కట్టుకున్న బట్టలు చూడగానే రంగడికి ఒక కోరిక కలిగింది. రఘు వేసుకున్న సిల్కుబట్టలను ఒక్కసారి చేత్తో ముట్టుకుని చూస్తే బాగుండునని ఆశ పుట్టింది. రంగడు ఎన్నాళ్ళనుండో తల్లిని ఎర్రటి లాగు తెల్లటి చొక్కా కుట్టించమని అడుగుతున్నాడు. ఒకసారి ప్లీడరుగారి గోపీ పుట్టిన రోజు పండగకు ఎర్రటి ముఖమల్ లాగు తెల్లటి కాటిన్ చొక్కా కుట్టించుకున్నాడు. చేత్తో చాక్‌లెట్లు పట్టుకుని బడికివచ్చి బళ్లో పిల్లలందరికీ తన పుట్టిన రోజు పండగ అని చెప్పి చాక్‌లెట్లు పంచిపెట్టాడు. అప్పటినుంచీ రంగడు అమ్మతో ఎర్రటి లాగు, తెల్లటి చొక్కా కుట్టించమని అడుగుతున్నాడు. "అలాగే నాయనా ఈ సారి తప్పకుండా కొనిపెడ్తాలే" అంటూ ఎప్పటికప్పుడే గడువులు పెడుతోందితల్లి. మొన్న జరిగిపోయిన పండుగనాడు అటువంటి బట్టలు కొనలేదని పేచీపెట్టాడు రంగడు. ఇంట్లో వున్న కుండలన్నీ సీసాలన్నీ విసిరి పగలగొట్టి నానా గొడవ చేశాడు. అమ్మ యెంతో బుజ్జగించి కొంటానని చెప్పిందేగాని కొనలేదు. దానితో వాడు పెద్దగా యేడుస్తూ అల్లరి చేశాడు. భరించలేక ఆ రోజు వాళ్ళమ్మ బాదబాదింది. పండగపూటా తిండి తినకుండా దెబ్బలుతిని యేడుస్తూ పడుకున్నాడు రంగడు. రాత్రి కూడా యేమీ తినలేదు. అమ్మ వాణ్ణి దగ్గరకు తీసుకుని వళ్ళంతా నిమురుతూ, వెక్కివెక్కి యేడ్చింది. 'మనం కూటికిలేని పేదోళ్ళంరా రంగా! పొద్దూకులు కష్టపడితే తిండికే సాలటం లేదు. ఇంక కొత్త గుడ్డలు యెట్లొస్తాయిరా నాయనా! నీకు అయ్య లేడు. నేను దిక్కులేనిదాన్ని' అంటూ భోరున యేడ్చింది గంగి. అమ్మ ఏడుస్తే వాడికీ ఏడుపొచ్చి పెద్దగా యేడ్చేడు. "నీకు ఈసారి తప్పకుండా అటువంటి గుడ్డలు కొంటా రంగా. బువ్వ తిందువుగాని లే బాబూ." అమ్మఎత్తుకుని అన్నం తినిపిస్తే తిని పండుకున్నాడు. ఈసారయినా అమ్మ యిటువంటి గుడ్డలు కొంటుందో లేదో! గట్టిగా ఏడుస్తే 'మనం పేదోళ్ళంరా బాబూ! మనం అటువంటివి కోరకూడదు అంటుంది అమ్మ. ఏమిటో!



మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడెన్సా
విశేషనమూతో
చికిత్సను పొందండి
- శస్త్రచికిత్స
అవసరములేదు!

అందరినీ అలరించే
"జ్యోతి చిత్ర"
చదివి ఆనందించండి!

ఉచితం ఉచితం ఉచితం
తెల్ల మచ్చలు
ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన మొదల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండి పోవును. ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి Address :
Samaj Kalyan (R.L. 78)
(P. o) Katri Sarai (Gaya)

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!

హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును.
వరిబీజము(బుడ్డు), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండ. రండి.
డా॥ దేవర, ఫోన్ 551,
మార్వాడి గుడివద్ద, తెనాలి.
బ్రాంచి: 26, నార్త్ బోగ్‌రోడ్, మద్రాసు-17


పేదోళ్ళయితే మంచిగుడ్డలు వేసుకో కూడదా ?'

రఘుబాబు వేసుకున్న లాగూ చొక్కా కూడా అలాటివే. ఒక్కసారి ముట్టుకుని చూస్తే బాగుండును. ఎంత బాగున్నాయో !

రంగడి చిన్న బుర్రలో పుట్టినకోరిక పెరిగి పెద్దదై కూర్చుంది. మీనాక్షి పేరంటాళ్ళను సాగనంపి హడావుడిగా లోపలి కెళ్ళింది.

రంగడిని చూడగానే రఘుకు ఏమని పించిందోగాని టేబిలు పైనున్న పొట్లంలో నుంచి ఒక బిస్కెట్టు, ఒక చాక్‌లెట్టు తీసి "యిందరా రంగా!" అని యిచ్చాడు. రఘు క్రిందకు విసరివేస్తున్న బిస్కెట్టు చాక్‌లెట్టు క్రింద పడకుండా అపరూపంగా తన చింకిచొక్కా కొసపట్టి అందుకున్నాడు రంగడు. వాటిని యిటూ అటూ త్రిప్పి చూస్తున్నాడు.

"తినెయ్యరా. రంగా." అన్నాడు రఘు.

"ఉహూ. అమ్మకు చూపి తింటా."

చింపిరి తలకాయ తిప్పుతూ అవి చింకి చొక్కా జేబులో భద్రం చేసుకున్నాడు రంగడు.

అంత చిన్న వయసులోనే తన ఆధిక్యం చాటుకుందుకు వుబలాట పడ్డాడు రఘు. తనకు దొరికిన ఆటవస్తువులన్నీ రంగడికి చూపించేడు. కీ యిచ్చి విడిస్తే గంతులువేసే కోతిబొమ్మ, కళ్ళు తిప్పుతూ డాన్సుచేసే బేబీబొమ్మ, కీ యిస్తే పరుగెత్తే రైలు అన్నీ. యింకా యెన్నో యెన్నో బొమ్మలు చూపించాడు రఘు. "నీకు యిన్ని బొమ్మలు వున్నాయా రంగా!" గర్వంగా అడిగాడు రఘు.

"లేవు" జాలిగా బాధ గొలిపేటట్లు అన్నాడు రంగడు.

"పోనీ యిట్లాంటి బట్టలున్నాయా!" దర్జాగా, ఠీవిగా, కూర్చుంటూ అడిగాడు రఘు.

"ఉహూ! లేవు." దీనంగా అన్నాడు రంగడు.

"మీఅమ్మను కొనమని అడుగు" రఘు సలహా యిచ్చాడు.

'మాకు నాన్నలేదు. మేం పేదోళ్ళంట. మా అమ్మ కొనిపెడతానంటుందిగాని కొన లేదు.' కళ్ళు తుడుచుకున్నాడు రంగడు.

రఘు తృప్తిగా గర్వంగా తన బట్టల వైపు చూచుకున్నాడు. త్వరగా లేచి బొమ్మలన్నీ సరిగ్గా సర్దుతున్నాడు. వెనుక తిరిగి బొమ్మల్ని సర్దుకుంటున్న రఘు దగ్గరకు పిల్లిలా అడుగులువేస్తూ వచ్చాడు రంగడు. మెల్లిగా రఘు చొక్కా నిక్కరూ చేతి వ్రేళ్ళతో ముట్టుకుని చూశాడు.

## బాల గోపాలం



కుర్చీపీట మీద
కొలువున్న పాపా!

ఫొటో : ఆర్. భావనారాయణ. పొన్నూరు

అబ్బ ఎంత మెత్తగా వున్నాయో! ఎంత బాగున్నాయో! అమ్మను ఎలాగయినా యిటువంటివి కొనమని అడగాలి. చొక్కా నిక్కరూ పట్టుకుని పరధ్యానంగా ఆలోచిస్తూ గట్టిగా పట్టుకున్నాడు రంగడు.

రఘు బొమ్మలు సర్దివేసి వెనక్కి తిరిగాడు. రంగడిచేతులో చొక్కా కొస గట్టిగా యిరుక్కుపోయి వుంది.

"రంగా నాచొక్కా విడచిపెట్టు." గట్టిగా అరచి విదిలించుకున్నాడు. రఘు. రంగడు ఏ విధంగా అమ్మని కొనిపెట్టమని మారాం చెయ్యాలో ఆలోచిస్తూ రఘు చొక్కా విడిచిపెట్టలేదు. రఘుమాటలు వినిపించుకోలేదు.

"అమ్మా! అమ్మా! ఈ రంగడు చూడవే నా కొత్తగుడ్డ లెట్లా పాడుచేస్తున్నాడో!" గట్టిగా అరుస్తూ ఏడుపు లంకించుకున్నాడు. గారాలపట్టి రఘు.

మీనాక్షి కొడుకు యేడుపువిని ఒక్క పరుగున వచ్చి వాలింది. అప్పటికి రంగడు తెలివి తెచ్చుకున్నాడు.

రఘును విడచి దూరంగా నిలబడ్డాడు రంగడు.

"హోరి ముదనష్టపు వెధవా! మా పిల్లాడి నెందుకు ముట్టుకున్నావురా! నిన్నెవరు యిక్కడకు రానిచ్చారు? కంపు గుడ్డలూ నువ్వూ దూరంగా తగలడు."

మీనాక్షి జడివానలాగ తిట్టి ఒక్క ఉదుటున వచ్చి రంగడిచెంప ఛెళ్లుమనిపించింది.

కొడుకును దగ్గరగా తీసుకుని ప్రాపింగు

దరిగా చేసి ముద్దుపెట్టుకుంది. "భయపడ్డావా నాన్నా? ఆ పాడు వెధవనెందుకు రానిచ్చావురా?" అని ప్రశ్నించింది.

"ఇక్కడే నిలబడ్డాడు వాడు. పోనీకదా అని బొమ్మలు చూపిస్తే నిక్కరూ చొక్కా నలిపేశాడమ్మా. చొక్కా గట్టిగా పట్టుకుని ఎంత వదలమన్నా వదలటం లేదే! అందుకని ఏడ్చాను."

గారంగా అన్నాడు రఘు.

"అలాగా. దరిద్రగొట్టు వెధవ. వీడి నెవరు తీసుకురమ్మన్నారు. గంగీ! ఓ గంగీ. యిలారా! ఈ పాడు వెధవ చేసిన పని చూడు." గట్టిగా గావుకేక వేసింది మీనాక్షి.

అంట్లుతోమటం ముగించి. ప్రక్కలు వేస్తున్న గంగి అమ్మగారి కేకలు విని పరిగెత్తి వచ్చింది

"ఏమయిందమ్మగోరూ!" ఆత్రుతగా అడిగింది.

"ఏమయిందని నెమ్మదిగా అడుగుతున్నావు చే? నీ కొడుకునెందుకు తీసుకొచ్చావు? ఆ ముదనష్టపు వెధవ మా వాడిని ముట్టుకుని గుడ్డలన్నీ నలిపి మురికి చేసేశాడు చూశావా? వెధవ. బిస్కట్లు దొంగతనంగా తీసుకున్నాడు. చచ్చినాడు - మా వాడి వంటిమీద చెయ్యి వెయ్యటం ఎందుకూ?"

గంగి ముఖం వాచేటట్లు చీవాట్లు వేస్తూ చెప్పింది మీనాక్షి. కళ్ళంట నీళ్ళుకారుస్తూ గజగజలాడుతూ నిలుచున్న కొడుకువేపు చూసి. నోట మాటరాక నిలబడిపోయింది గంగి.

"ఏమిటలా చూస్తావు? వెధవకి రెండు దెబ్బలువేసి అవతలకీడ్చి పారెయ్యాలి గాని ఈ ముద్దేమిటే!" మీనాక్షి చిర్రుబుర్రు లాడింది.

"రావద్దంటే వినవు. చిన్న బాబుగారి నెందుకు ముట్టుకున్నావురా యెదవ సన్నాసీ" తిడుతూ రెండు దెబ్బలువేసి వాడి రెక్కలు పుచ్చుకుని బరబరా లాక్కుపోయి దొడ్లో బాదం చెట్టుక్రింద కూర్చోబెట్టింది గంగి.

రంగడు నోటమాటలేక అట్లాగే కూర్చున్నాడు.

గంగికి అమ్మగారి తిట్లవల్ల అతి కోపం ముంచుకు వచ్చింది.

"మాట్లాడవేంరా! దరిద్ర పీనుగా! నేను వచ్చేవరకూ యీడ నుంచి కదిలితే బొక్కలిరగదీస్తా. తెల్సిందా!" మరి రెండు దెబ్బలు వేసి తిరిగి పనిలోకి పోయింది గంగి. రెండు మోకాళ్ళలో తల పెట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చాడు రంగడు. వాడి చిన్నబుర్రలో తను చేసిన తప్పేమిటో ఏమిటో వాడికి అర్థంకాలేదు. బిస్కెట్టు తనేమీ దొంగిలించలేదే! రఘు బాబు పిలిచి మరీ యిచ్చాడు. రఘు బాబు కట్టుకున్న బట్టలు ముట్టుకుని చూడటం తప్పా? అలాగే ఏడుస్తూ కూర్చున్నాడు.

గంగి పనంతా పూర్తిచేసుకుని రంగడి దగ్గరకు వచ్చింది. కొడుకు అలాగ తల మోకాళ్లలో పెట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తూ కూర్చోవటం చూడగానే ఆ తల్లి కడుపు తరుక్కుపోయింది.

"రంగన్నా! ఏడవకు బాబూ. రా యింటికి పోదాం" వాడి ముక్కూ ముఖం పమిటచెంగుతో తుడిచింది. అమ్మగారు తనచేతిలో వేసిన మిఠాయివుండ. యిన్ని శనగలు వాడిచేతులో పెట్టి తినమంది. వాడు ఏడుపుమాని తింటున్నాడు.

"అయినా రంగా సిన్న బాబుగారిని ఎందుకు ముట్టుకున్నావురా! బిస్కత్తులెందుకు తీసుకున్నావు?" ఆప్యాయంగా కొడుకు తల నిమురుతూ అడిగింది గంగి. తింటున్న మిఠాయి విడిచిపెట్టి బావురుమన్నాడు రంగడు.

"నేను బిస్కత్తులియ్యలేదమ్మా! ఆ బాబే పిలిచి యిచ్చాడు. గుడ్డలు బాగున్నాయని దగ్గరకెళ్ళి ముట్టి చూశానంతే. అమ్మగారు సూడు ఎంత గట్టిగా కొట్టారో?" వాచి ఎర్రబడిన బుగ్గ చూపించాడు రంగడు.

గంగి మనసు విలవిలలాడిపోయింది. కళ్ళు చెమర్చాయి. "పేదోళ్ళ బ్రతుకులు యింతకన్నా బాగుంటయా?" మనసులో ఏడ్చుకుంది గంగి. ఏ విధంగా అన్నా తన్నే తిడతారు. బాధ దిగమ్రింగింది. వాచి ఎర్రబడిన కొడుకు బుగ్గను ప్రేమతో నిమురుతూ ఎత్తుకుంది.

"అమ్మా నాకుగూడా ఎర్రలాగూ తెల్ల చొక్కా కొనిపెట్టవా?" దీనంగా ప్రార్థించినట్లే అడిగాడు రంగడు. త్వర త్వరగా నడుస్తున్న గంగి పరధ్యానంగా "అట్టాగే కొని పెడతాలేరా" అంది

అది మాట వరసగా అన్నదిగాని అనాలని అనలేదు. అమ్మగారితో చెప్పి గేటు దాటి కొడుకుతో బైటపడ్డ గంగి పిల్లవాడిని క్రిందదించి నడవసాగింది.

అప్పటికే దీపాలు పెట్టేశారు. ఆకాశం

ఋణం

వ్యాపారాభివృద్ధికోసం ఆకర్షణీయమైన షరతులమీద భవనం, వ్యాపారం షాపులు, భూములు, థియేటర్లు, లిమిటెడ్ కంపెనీలు, పరిశ్రమలు వగైరాలపై రు. 20,000 లేక ఆ పైన ఋణం లభించును.
వ్రాయండి లేదా సంప్రదించండి. ఫోను : 395126

SUPREME CORPORATION (BANKERS)
F-15 "EVEREST" 7th Floor, Near Famous cine laboratory,
Tardeo Road, BOMBAY-400 034

ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో

ఒకసారి "ట్యాంగో" ధరిస్తే మరొకటి ఇష్టపడరు

ట్యాంగో ®

అండర్‌వేర్లు-బనియన్లు

## తక్కువ కార్టూన్లు గీసినా మంచివి గీయాలి

"వేణు" పేరుతో వివిధ మాస, వార పత్రికల్లో కార్టూన్లు ప్రచురింపబడిన



నా పూర్తి పేరు ఆకు దుర్గా వెంకట వేణు గోపాలరాజు. జననం 18-8-1959. పుట్టి పెరిగి విద్యాభ్యాసం గావించింది విజయవాడే. ప్రస్తుతం విజయవాడ ఎస్. ఆర్. ఆర్. అండ్ సి.వి.ఆర్. ప్రభుత్వ కళాశాలలో ఫైనల్ బి. కాం. చదువుతున్నాను.

నేను 1975 నుంచి కార్టూన్లు గీయటం ప్రారంభించి, ఇప్పటివరకు ఒక వెయ్యి కార్టూన్లు దాకా వేశాను. కాని ప్రచురింపబడినవి మూడు వందలే! తక్కువ కార్టూన్లు గీసినా మంచివి గీయాలని నా ఉద్దేశ్యం. కార్టూన్ అన్నది కేవలం

### ఈ వారం కార్టూనిస్టు

హాస్యాన్నే స్ఫురింపక, అది సమాజమునకు ఎంతో కొంత ఉపయోగపడేలాగుండాలని నా అభిప్రాయం.

నా కార్టూన్లు అనేక పత్రికల్లో ప్రచురింపబడటమేగాక- ప్రెస్ క్లబ్ -విజయవాడ, రోటరాక్ట్ క్లబ్ - తెనాలి, సాధన సమితి -హైదరాబాదు. కాస్మోస్ అండ్ ఫిలింఫాన్స్ కల్చరల్ సెంటర్ -గుంటూరు 5వ అఖిలభారత వ్యవసాయ, పారిశ్రామిక ప్రదర్శన -విజయవాడ మొదలగు వారి ఆధ్వర్యాన ప్రదర్శించబడి, వారు నిర్వహించిన కార్టూన్ల పోటీలో బహుమతులు కూడా వచ్చాయి.

బాపు, జయదేవ్, ఆర్. కె. లక్ష్మణ్ మొదలగువారు నా అభిమానకార్టూనిస్టులు. వపా, చంద్ర నా అభిమాన చిత్రకారులు. రేడియో వినడం, సినిమాలు చూడటం, ఆటలు ఆడటం నా హాబీలు. విద్యలో పోస్టుగ్రాడ్యుయేషన్ చదవాలని, ఒకమంచి కార్టూనిస్టును అవ్వాలని నా ధ్యేయం.

— వేణు

నలుమూలలా కారుచీకట్లు క్రమిక్తి మేఘాలు అల్లుకుంటున్నాయి. రోడ్లమీద దీపాలు వెలుగుతున్నా తమ యింటి త్రోవలో దీపాలు లేనందువల్ల చీకటిపడి పోయిందని త్వరత్వరగా నడుస్తోందిగంగి. దానికి సాయం వర్షాడంబరం వొకటి. వానరాకట ప్రాణపోకట ఎవరూ చెప్పలేరు గదా! వర్షాగమనం త్రోవనుబోయే జనానికి తొందర పుట్టించింది. ఎవరో ముందుకు నెట్టుతున్నట్టే మనుషులు తొడ త్రొక్కిడిగా నడచిపోతున్నారు. వర్షం రాకుండా యిల్లు చేరాలని గంగి ఆతృతగా కొడుకు చెయ్యి పట్టుకుని బరబరా లాక్కుపోతూంది. గంగి యిల్లు ఊరికి కాస్త దూరంగా వుంది. త్రోవలో అంగళ్ళు దాటుతేగాని ఆ త్రోవ చేరలేదు. కిరాణా సామాన్ల కొట్లు, గుడ్డలకొట్లు బొమ్మల షాపులు అన్నీ దాటుకుంటూ వెళ్తూంది గంగి. రంగడు తల్లితో నడుస్తూ నడుస్తూ ఒక బట్టలకొట్టుముందు ఆగి క్రింద కూర్చుని ఏడుపు లంకించుకున్నాడు.

"ఈడ ఏడుతావేంరా? ఏం కావాలో చెప్పు." కొడుకును కసురుకుంది గంగి.

"ఉహూ. ఉహూ. నాకు కొనిపెట్టు." క్రింద కూర్చునుండి పాదాలు నేలకేసి కొట్టుకుంటూ ఏడుపుస్వరం హెచ్చించాడు రంగడు.

"ఇప్పుడే అమ్మగారిచ్చిన మిఠాయి అవీ తిన్నావు గదరా! యింద. ఈ అయిదు పైసలిచ్చి ఏం కావాలో కొనుక్కురా." బొడ్లోనుండి పైసలుతీసి కొడుకు కిచ్చింది గంగి.

వాడు పైసలు పుచ్చుకోక పోవటం సరికదా క్రింద పొర్లాడి మరీ రాగాలు హెచ్చించాడు.

గంగి ఎంత బుజ్జగించినా ఏడుపు తగ్గించలేదు. అప్పటికే వచ్చీపోయే జనం పోగయి వింతగా వాళ్ళిద్దరివైపూ చూస్తున్నారు. కొందరు అధిక ప్రసంగులు స్వయంగా కలుగజేసుకుని సలహాలు ఉచితంగా యిస్తున్నారు.

"పిల్లవాడెందు కేడుస్తున్నాడో! కసుక్కోని వూరుకోబెట్టమ్మా."

"అయ్యో! పిల్లవాడెందు కేడుస్తున్నాడో! ఏంకావాలో కొనిపెట్టవమ్మా"

గంగికి ఒక్కొక్కరి హెచ్చరికలు అందుతున్నాయి. తన అసమర్థతకు గంగికి సిగ్గువేసింది. ఎంతతియ్యారించినా వాడికి ఏంకావాలో చెప్పటంలేదు రంగడు. ఎంతో బ్రతిమలాడగా ఎదరగావున్న రెడీమేడ్ దుస్తుల షాపులో వ్రేలాడవేసిన తెల్లచొక్కా ఎర్రలాగూ చూసి అవి కొనిపెట్టమని వెక్కివెక్కి ఏడుస్తున్నాడు రంగడు.

## బాల గోపాలం



కాళ్ళాగజ్జె, కంకాణమ్మా!

ఫోటో: ఎ. యి. జగన్, సికింద్రాబాద్

రంగి తలఎత్తి ఒకసారి ఆ బటలవైపు చూసింది. రఘు వేసుకున్నంత మంచి బట్టలు కాకుండా చవక రకంలోవున్న ఎర్రలాగూ తెల్లచొక్కా అమ్మెకంటికి కనిపించాయి. ఆ క్షణంలో కళ్ళనీళ్ళుకూడా అప్రయత్నంగా నిండాయి. కాని అవి కొనేదెలాగ? రంగణ్ణి యింక ఎట్లా సముదాయించాలి? చేతిలో చిల్లిగవ్వలేదు. నెలాఖరు. అంట్లు తోముకుంటున్న యిండ్లలో అర్ధరూపాయన్నా అప్పుపుట్టదు. పదిపైసలడిగినా అమ్మగార్లు 'నెలాఖరున అడుగుతే ఎట్లాగే' అంటారు. ఇంకాకోపంవచ్చినఅమ్మలయితే 'ఎప్పుడూ నెల ముందుగానే జీతం వాడుకుంటావు. అవసరం అంటూ అప్పు తెమ్మంటే ఎట్లా యిస్తాం' అని సాధిస్తారు. ఈ పిల్లవాడి కోరిక తీర్చే మార్గమేముందీ? ఏం చెయ్యాలి? ఎట్లా లాలించాలి? గంగి తన నిస్సహాయతకు తనే తట్టుకోలేక నిలచిపోయింది. జనం పోగయి వింత చూస్తున్నారు. అతికష్టంపై కంఠం అదుపులోకి తెచ్చుకుంది. ఆ క్షణంలో రంగడి ఒళ్ళు హూనం చెయ్యాలన్నంత కోపం కూడా ముంచుకు వచ్చింది గంగికి. అయినా తమాయించుకుని మనసులో లేని ఆప్యాయతను తెచ్చిపెట్టుకుని లాలించింది.

"ఒరే రంగన్నా యింటికెళ్ళి డబ్బు పట్టుకవద్దాం. యిప్పుడేవచ్చి కొనుక్కుందాం రా బాబూ. డబ్బు యివ్వందే కొట్లో

వాళ్ళు గుడ్డలీయరు రా." ఆప్యాయత తెచ్చిపెట్టుకుని అందేగాని కొడుకును చూస్తే ఒళ్ళు మండిపోతూంది గంగికి.

"ఉహూ. నేను రాను పో. యింటికెళ్ళి నువ్వే డబ్బుతే. నేను రాంగానే డబ్బులేదు. మరోసారి కొంటాలేరా. అంటావూ. ఉ."

శృతి మరీ హెచ్చించి రోడ్లో దొర్లుతూ ఏడుపుతు లంకించుకున్నాడు రంగడు.

గంగికి యిక ఓర్పు నశించి పోయింది. ఆమె కోపం హద్దుమీరి పోయింది.

"పాడు వెధవా. చెప్పిన మాట వినవేంరా? నీకు క్రొత్తగుడ్డలు కావాలా? నే నేడ తెచ్చేదిరా! పీడాకారం వాడా. చావరా వెధవా!" వళ్ళు తెలియని ఆవేశంతో తిడుతూ రంగడిపై విరుచుకుపడి బాదదెబ్బలు బాదింది గంగి.

"ఊరుకోవమ్మా! పిల్లాడిని చంపేస్తావా?"

అయ్యో. అయ్యో. బిడ్డ చచ్చిపోతాడమ్మోయ్. చుట్టుప్రక్కల జనం మూగి రంగణ్ణి ఆమె చేతుల్లోనుంచి విడదీశారు. గంగికి అప్పటికి గాని వళ్ళు తెలియలేదు. సిగ్గుపడిపోయి. గిలగిల కొట్టుకుంటున్న కొడుకుని బలవంతాన లాక్కుపోసాగింది. కొంతదూరంవరకూ పాడు ఎక్కుతూ ఎగవూపిరి పీలుస్తూ నడిచేడు- కాని వాడుతిన్న దెబ్బలకు వాడి శరీరం తట్టుకోలేకపోగా నడుస్తున్నవాడు అలాగే రోడ్డుపై సొమ్మసిల్లి పడిపోయాడు. ఒకప్రక్క వర్షం ప్రారంభించింది.

"ఓరి నా కొడుకా! సచ్చిపోయావురా! నా సేతులుపడా! ఎన్నిదెబ్బలు కొట్టేశానురా నాయనా!" లబో దిబోమని ఏడుస్తూ క్రిందపడిన కొడుకుని బుజాన వేసుకుని యిల్లు చేరుకుంది గంగి. ఇలు చేరుకునేసరికి యిద్దరూ తడిసిపోయారు. మంచంమీద వాడినివేసి ఒళ్ళంతా తుడిచింది. బుడ్డిదీపం వెలిగించింది. చింకి బొంత వాడి వంటినిండా కప్పింది. గాని రంగడికి తెలివి రాలేదు. నిద్దట్లో నే ఏడుస్తూ యింకా యెక్కిళ్ళు పెడుతూనే వున్నాడు రంగడు.

ఇంత గంజి వేడిచేసి తెచ్చి పిల్లవాడి నోట్లో బలవంతాన పోసింది. వాడు రెండు గ్రుక్కలెలాగో మ్రింగి పడుకుండిపోయాడు. పిల్లవాడి ప్రక్కలోనే తానూ యేమీ తినకుండా కంటనీరు పెట్టుకుంటూ సాగిలి పోయింది గంగి. దానికెంత రాత్రయినా కునుకు పట్టలేదు. కంటినీరు కట్టలేదు.

"కూటికి గతిలేని దానికి ఈ సంతానమెందుకు యిచ్చావు భగమంతుడా! పిల్లవాడి కడుపుకు యింత కూడు పెట్టడమే కష్టమైతే యింక కొత్త గుడ్డలు ఎట్టా తెచ్చేది? పాచి పనిచేసే యిండ్లలో అమ్మగార్లు దయతలచి ఎప్పుడయినా పాత గుడ్డలు యిస్తారు. వాటితో ఎలాగో దినం వెళ్ళమార్చుకుంటూంది. ఒకపూట తిని ఒక పూట తినకుండా వుంటేనే రోజులు గడవటంలేదు. నెలంతా కష్టపడి చాకిరీ చేస్తూ ఎండనక, వాననక తిరుగుతే నెలకు యిరవై రూపాయలు రావటంలేదు. పెట్టిన అమ్మ అన్నం పెడితే పుణ్యమనుకుని తీసుకుంటుంది. పెట్టనమ్మల్ని ఎంతడిగినా మెతుకు విదిలించరు. అన్నం దొరకని రోజుల్లో గింజలుకొని ఉడకేసుకోవటందొరికిన రోజు దానితోనే గడపటం చేసుకుంటుంటే దినం ఎలాగో వెళుతున్నది. కలిగినమ్మ కడుపు కరిగితే చింకి పాతలు యిస్తుంది. అవే మహా భాగ్యమని తను కట్టుకుంటుంది. పిల్లవాడిని చూపించి అడిగితే దయతలచిన అమ్మ పాత లాగులు చొక్కా యిస్తారు. వాటితో పిల్లవాడి కాలక్షేపం జరుగుతున్నది. బడిలో పంతులుగారింటి పనిలో కుదిరితే పిల్లవాడికి జీతం పుస్తకాలు అక్కరలేకుండా బళ్లో చేర్పించింది. రంగడి ముద్దు ముచ్చటలకోసం ఎంత కష్టపడ్డా జరగటంలేదు. నెలంతా రెక్కలు ముక్కలు చేసుకున్నా యిప్పుడు కొత్త బట్టలు తేగలదా? అక్కడికే రెండు నెలల కిందట పేవ్‌మెంటుమీద పాత బట్టలు అమ్మే అబ్బి దగ్గర రెండున్నర రూపాయలు పోసి రంగన్నకు ఓ లాగు ఓ చొక్కా కొంది. అవీ అప్పుడే చిరుగు పట్టేశాయి. ఏమి చేయ్యాలి? రంగడ్ని కోరిక తీర్చేదెలాగ?

"యిటూ అటూ కదులుతూ కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తూండగా గంగి చెవులో కోడికూత వినిపించింది. అబ్బో అప్పుడే తెల్లారిపోతూంది. ఏ అమ్మగారింటికి ముందు వెళ్ళకపోతే ఆఅమ్మగారికే కోపం వస్తుంది. అనుకుంటూ లేచి త్వర

## మల్లెపందిరి

### వేట

పులి జింకను వేటాడుతుంది. యముడు జీవుల్ని వేటాడుతాడు. మదనుడు విరహుల్ని వేటాడుతాడు.

ఒక అడివి వుంది. అందులో ఒక జింక వుంది. జింక చుట్టూ ఒక వల వుంది. ఆ పరిసరంలో దావానలం రేగింది. యమభటునిలా ఒక పులి ఆ జింక మీద దూకబోతోంది.

పాపం కృష్ణుడు కనపడక, రాధ ఆ జింక అవస్థలో పడింది. తను వున్న తావే అడివై పోయింది. తన చుట్టూ చెలికత్తెలే వలలా ఉన్నారు. తన వేడి నిట్టూర్పులే దావానలం కమ్మినట్టు సోకుతున్నాయి. మదనుడే యముడిలా పులి ఆట ఆమె మీద ఆడుతున్నాడు.

ఆవాసో విపినాయతే ప్రియసఖీమాలాపి జాలాయతే
తాపోఽపి శ్వసితేన దావదహనజ్వాలాకలాపాయతే
సాపి త్వద్విరహేణ హంత హరిణీరూపాయతే హా కథం
కందర్పోఽపి యమాయతే విరచయ శార్దూలవిక్రీడితం॥

అని రాధ అవస్థను సఖి కృష్ణుడి దగ్గర చెబుతోంది.

—సౌభరి

ఉచితము! ఉచితము!
తెల్లమచ్చలు
అన్ని రకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మాన్పును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచార నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి. వివరాలకు
Bharat Ayurvedashram
P.O. Katri Sarai (Gaya)

త్వరగా పన్లు ముగించుకుంది గంగి. రంగడికి యింత చద్దికూడుగిన్నెలోకితీసి మూత వేసింది. నంజుకుందుకుఓఉల్లిపాయదానిపై పెట్టింది. రంగడిదగ్గరకెళ్ళింది. "నే పన్లోకి పోతన్నా రంగా. కూసేపాగిలేచి చద్దికూడు తినీ బాబూ.

నెమ్మదిగా చెప్పేసి తన అలవాటు పన్లలోకి పోయింది గంగి

అన్నిపన్లూ పూర్తిచేసుకుని పంపుదగ్గర నీళ్ళుపోసుకుని బారెడు ప్రొద్దెక్కాక యిల్లుచేరింది గంగి. రంగడింకా లేవనేలేదు గబగబా కొడుకు దగ్గరకువచ్చి లేపింది గంగి.

"రంగా. యింకా నిద్దరోతున్నావా? లే. లే. ఎంత పొద్దెక్కిందో చూచావా? రంగడి వంటిపై చెయ్యేసి లేవబోయిన గంగి గతుక్కుమంది. రంగడి వళ్ళు పేలిపోతున్నది. కొడుక్కు జ్వరం వచ్చిందని గాభరా పడింది గంగి. మళ్ళీ అనుమానం తీరక వాడివళ్ళు ముట్టుకు చూచింది. రంగడి వళ్ళు వేడిగా వుంది. గంగి వాడి ప్రక్కలో కూర్చుని. నెమ్మదిగా లేపి ముఖం కడిగి యింత గంజికాచి పట్టింది. వాడు ఓ గ్రుక్కతాగి అలాగే పడుకున్నాడు.

ఇక పగలెట్లో జరిగిందికాని రాత్రి వాడి జ్వరం మరీ హెచ్చిపోవటమేగాక కలవరింతలు కేకలు చెప్పశక్యం కాకుండా వున్నాయి.

"అమ్మా. అమ్మా. ఆ ఎర్రలాగూ తెల్లచొక్కా కొనవా. నేను రఘు బాబును ముట్టుకోనమ్మా. బిస్కత్తు నేను దొంగతనం చెయ్యలేదమ్మా. ఒక్క లాగు కొనమ్మా. అమ్మా. కొటకమ్మా."

వళ్ళు పేలుతున్న జ్వరంతో కలవరిస్తూ అదిరి అదిరి పడుతూనే అన్నాడురంగడు. తెల్లవారల్లా ఇవే కలవరింతలు. గంగి పిల్లవాడిని వళ్ళో పెటుకుని ఏడుస్తూ కూర్చుంది ఆ రాత్రంతా. ఆ రాత్రేకాక అది మొదలుకుని మూడు రోజులయినా రంగడి జ్వరం తగ్గటంకాని, ఎర్రలాగు తెల్లచొక్కా కొనమనే కలవరింతలు తగ్గటంకాని వాడుకన్ను విప్పి చూడటం కాని యేమీ జరగలేదు. గంగి హృదయం తల్లడిల్లి పోయింది. వాడికోరిక తీరుస్తే ఈ జ్వరం తగ్గి బ్రతుకుతాడనీ, లేకుంటే బ్రతకడనీ అనుమానం పట్టుకుని ఆమెను పీడింప మొదలెట్టింది. అది పెరిగి పెద్దదై విజృంభించగానే తను పనిచేసే ప్రతీ యింట్లోనూ పిల్లవాడికి జబ్బుగా వుంది. అప్పుగా ఓ పది రూపాయలు యిమ్మని కాళ్ళావేళ్ళాపడి బ్రతిమలాడింది. ఏ వొక్కరికీ కనికరం కలుగలేదు. అందరూ మొండిచెయ్యి చూపించారు. రంగడి జ్వరం యిసుమంతయినా తగ్గుముఖం చూపలేదు. కలవరింతలు కట్టలేదు. బట్టలషాపుకువెళ్ళి ఆ యజమానితో తనకువచ్చిన కష్టం చెప్పుకుని ఒక్కజత బట్టలు యిమ్మని, నెలకు రెండేసి మూడేసి రూపాయలచొప్పున తీరుస్తాననీ అరువు అడిగింది. "పదిహేనురూపాయల వెలచేసే బట్టలు నీలాటిదానిని నమ్మి అరువు యివ్వను" పొమ్మన్నాడు కొట్టుయజమాని గంగికి వెర్రెత్తినట్లే అయిపోతూంది. చేతిలో చిల్లిగవ్వలేదు. అమ్మిపారేద్దామన్నా యింట్లో పూచికపుల్లైత్తు వస్తువు లేదు. మట్టికుండలు చింకి బట్టలుతప్ప యితరమేమీలేవు. పిల్లవాడికోరిక తీర్చకుంటే బ్రతుకుతాడన్న ఆశ నశించింది. ఏదో నిర్ణయానికివచ్చి మనసు దిటవు చేసుకుంది గంగి. అటుప్రక్క పాకలోనున్న అవ్వను రంగడి దగ్గర కాపలా వుంచింది. త్వరత్వరగా రోజూమాదిరిగానే అంట్లు తోమటానికి వెళ్ళింది. రెండు యిండ్లలో ఆమెకు నిరాశే కనిపించింది. చివర యింటికి వచ్చింది. డాక్టరు గారింటి పనిలోకి వచ్చేక దానికండ్లు మెరిశాయి డాక్టరు గారి అమ్మగారు అంట్లు తోమించి ఆ గిన్నెలను దొడ్లోవున్న పెద్ద సిమెంటు అరుగు మీద బోర్లించమంటారు. తను అలాగే శుభ్రంగా తోమిన గిన్నెలను అరుగుపై బోర్లించి పోతుంది. ఒక్కొక్కసారి ప్రొద్దున్నతోమిన గిన్నెలు సాయంత్రం వరకూ అలాగే పడివుంటాయి. వంటావిడ చెయ్యి వీలుచూచుకుని యింట్లో సర్దుతుంది ప్రొద్దున్న తోమి బోర్లించిన గిన్నెలు అట్లానే ఉన్నాయి.

అంట్లు పడెయ్యండమ్మా. నెమ్మదిగా గంగికేక వేసింది. వంటావిడవచ్చి గిన్నెలు వేసి ఇంత చింతపండుకూడా పడేసి లోనికి పోయి తలుపేసుకుంది. గంగికి తోమడానికి వేసిన గిన్నెలు చూడగానే గుండెలు దడదడ కొట్టుకున్నాయి. అన్నింటితోపాటు తను అనుకున్న వెండిగిన్నెకూడా పడింది. చేతులు కాళ్ళు గజగజలాడుతు ముచ్చెమటలు పోశాయి గంగికి. తమాయించుకుని త్వర త్వరగా అంట్లన్నీ తోమేసింది. గిన్నెలు అరుగుపై బోర్లిస్తూ అటూ యిటూ పరీక్షగా చూసింది. చుట్టుపక్కలెవ్వరూ కనిపించలేదు. ఇంట్లో తు రామన్న ఆసుపత్రి గుమ్మంలో కూర్చుని కునికి పాట్లు పడుతున్నాడు. అదును చూచుకుని వెండిగిన్నెను తీసి నాలుగు బాదంఆకుల్లో చుట్టబెట్టేసింది గంగి. అమ్మగారు పెట్టిన అన్నం దాచుకునే వెదురు బుట్టలో వడేసింది, పైన చింకిపాత కప్పేసింది. అప్పటికే దాని చేతులువ్రేళ్ళు నిలవకుండా వణికిపోతున్నాయి. కాళ్ళు గజగజ లాడిపోతున్నాయి. మనసు పాపం శంకిస్తూ గంగిని నిలవేసింది.

ఛ. ఛ. పాడుపని చేతన్నావే గంగీ. బగమంతుడు నిన్ను మెచ్చుకోడు. తప్పు. తప్పు. ఆ గిన్నెతీసి అరుగుమీద పెట్టు.

మనస్సుకు యెదురుతిరిగింది గంగి.

బగమంతుడా? ఎక్కడున్నాడు? పేదోళ్ళంటే ఆ బగమంతుడికి కూడా అలుసే. నేనేం తప్పు సెయ్యలేదు.

సమర్ధించుకుంది గంగి.

"నువ్వు దొంగతనం సేత్తూ తప్పు సెయ్యలేదంటున్నావుటే. గంగీ? దొంగతనం సేతే వూరుకోరు. పోలీసులు వచ్చి పట్టుకుని జయిలులో పెట్టేత్తారు తెలుసా? ఆ గిన్నె అక్కడపెట్టు మర్యాదగా."

గంగి మనస్సు ఎగిరిపడి అదమాయించింది. ఓస్ పోలీసులేగదా? రానీ! జయిలులో పెడితే నాకే మంచిది. ఆడ యింత కూడయినా పెడతారు.

గంగి మనసును సముదాయించింది.

"ఓసి ఎర్రి గంగీ. అక్కడ కూడుమాట అటుంచు. నువ్వు జెయిలులో కూకుంటే నీ బిడ్డ గతేంకాను? ఫలానీ పనిమనిషి గంగి దొంగముండ చూడండి అని వూరు వూరంతా నిన్ను సెప్పుకోరుటే?"

గంగి మనసు గట్టిగా బుద్ధి చెప్పింది. పోనిద్దూ సెప్పుకుంటే సెప్పుకోనీ ఈ సెప్పుకునే నాళ్ళందరినీ నా బిడ్డను బ్రతికించుకోటానికి అప్పుపెట్టమని పది రూపాయల కోసం అడుక్కుని దేబిరించాను. అప్పుపెట్టారూ? నా బిడ్డ బతికితే నాతో పాటే ఆడూనూ. గంగి మనస్సును గట్టిగా దమాయించి అణిచివేసింది. వళ్ళు మాత్రం చమటతో తడిసిపోయింది. నాలుకతడి ఆరిపోయింది. చెవులలో నుంచి వేడి గాలులు వచ్చాయి. కొద్ది క్షణాలలో వళ్ళు అదుపులోనికి తెచ్చుకుంది. మాతృ

శ్వేతవర్ణపుమచ్చలు



శ్రొత్తగా కనిపెట్టబడినవి మచ్చలపై కొద్దిగా మందు వేసినట్లయితే వాటిమీద ఉన్న మలినం క్రమంగా వదులుతుంది. ఆ మచ్చల యొక్క రంగు మారిపోయి అసలు చర్మంలో కలసిపోతుంది. ఒక్కసారి వాడండి మరియు దాని ప్రభావాన్ని చూడండి.

SHYAM AYURVED BHAVAN
P.O. KATRI SARAI (GAYA)

ప్రేమ జయించింది. చేతో సజ్జబుట్ట పట్టుకుని పెరటి ద్వారం దాటి వీధి గుమ్మంలో నిలబడింది. ఆ సుపత్రి గుమ్మంలో కూర్చున్న రామన్నను చూసి దగ్గర కెళ్ళింది.

"ఇదుగో రామన్నా! అంట్లన్నీ తోమేసి పెట్టాను మా రంగన్నకు నాలుగు దినాల నుండి జొరం తగ్గలేదు. అమ్మగారితో రేపు పనిలోకి రాలేనని చెప్పు బాబూ!"

రామన్న జవాబుకు యెదురు చూడకుండా చకచకా గేటుదాటి రోడ్డెక్కి పోయింది గంగి.

మెడపట్టుకుని తనను యెవరో తరుముకుని వస్తున్నట్లే భయం భయంగానే తొట్రుపాటు పడుతూ నడుస్తూంది గంగి. అందుకు సాయం, రోడ్డు మధ్యలో పోలీసు చెయ్యి వూపుతూ గొడుకు క్రింద కనపడంగానే దాని ప్రాణాలు పైన ఎగిరి నట్లయిపోయాయి నాలుగు రోడ్ల మధ్యనున్న రాతి గొడుగు క్రింద పోలీసు వచ్చేపోయే వాహనాలకు దారి చూపుతున్నాడు. వాహనాలకు దారి చూపటం కాకుండా అదిగో గంగి. దొంగముండ పట్టుకోండి డాక్టరుగారి యింట్లో వెండిగిన్నె పట్టుకు పోతూంది. పట్టుకోండి. పట్టుకోండి అని అరుస్తూ తనవైపే చూపించుతున్నట్లు దాని చెవుల్లో ధ్వని మ్రోగింది. ఒక్క నిముషం దిగ్భ్రమ చెందినట్లు నడిరోడ్డులో నిలిచిపోయింది గంగి. నెమ్మదిగా సర్దుకుంది తిరిగీ. ఎవరూ లేరు. నా మనసే నన్ను నిలవేసింది అని సమర్థించుకుని ధైర్యం తెచ్చుకుని అతిత్వరగా నడచి పోలయ్యశెట్టి అంగడికి దారి తీసింది.

పోలయ్యశెట్టి అతి పిసనారి. గడుసుతనం గల వ్యాపారి. దొంగ వెండి బంగారాలను అతి చవుకగా కొనెయ్యగల చాకచక్యం గలవాడు. పాతిక రూపాయల వస్తువు పది రూపాయలకు కొంటాడు. పది రూపాయలకు అమ్మవలసిన సరుకును పాతిక రూపాయలకు తక్కువగా అమ్మనే అమ్మడు. గంగికి నెలాఖరు వరకూ అరువుగా పప్పు వుప్పు ఇత్యాదులు వేస్తాడు. జీతాల టైముకు నిలవేసి మరీ పుచ్చుకుంటారు. గంగి శెట్టికి రహస్యంగా గిన్నె అమ్మకానికి చూపించింది. దొంగ బావతని కనిపెట్టిన శెట్టి ముప్ఫయి రూపాయల ధరచేసే గిన్నెను పదిరూపాయలకు వెలకట్టాడు. పైగా నీరసం వెండి యెందుకూ పనికిరాదు. నేను గనుక పది రూపాయలు యిస్తానన్నాను. మరొకరికి చూపావుకాదు. దొంగ సొమ్మని పోలీసులకు నిన్ను పట్టించేసేవారు. అని బెదిరించాడు పోలయ్యశెట్టి. గంగి కాళ్ళావేళ్ళా పడి బ్రతిమ లాడగా పదమూడు రూపాయలు దానిచేతపెట్టి పొమ్మన్నాడు. అదే పదివేలు అనుకుని గంగి రడీమేడు దుస్తులషాపుకు పరుగుతీసింది. ఆ షాపు యజమాని దీని అదను కనిపెట్టి యిరవై రూపాయలు చెప్పాడు అవే బట్టలు. ఎట్లాగో బ్రతిమలాడి బారమాడి పదమూడు రూపాయలకు ఆ ఎర్రని లాగూ తెల్లని చొక్కా కొన్నాది గంగి. ఆ గుడ్డలు దాని చేతుల్లో పడగానే వెయ్యి ఏనుగుల బలం వచ్చింది గంగికి. దాని మనసు సంతోషంతో పరవళ్ళుత్రొక్కింది. దాని ముఖంలో ఈ ప్రపంచమంతా జయించినంత తృప్తి తొణికిసలాడింది ఆ క్షణంలో.

బట్టలను ముద్దు పెట్టుకుంది. వెర్రి నాగన్నా నా రంగా. నువ్వు అడిగిన లాగూ చొక్కా నీ అమ్మ కొనిందిరా. ఎదవన్నా! యివి సూడగానే నువ్వు వేసుకోవాల. నీ కళ్ళు సంతోషంతో మెరుస్తుంటే చూసి నిన్ను నేను ముద్దెట్టుకోవాల. ఎంత బాగున్నాయి యీ గుడ్డలు? యీ గుడ్డలకోసం తనెంత బాధపడిందీ? ఎందర్ని అడుక్కుందీ? వట్టి అడుక్కోవటమేనా? ఆ అమ్మగార్ల ఈసడింపులు తిట్లు ఎన్ని భరించింది తాను? ఎవర్నడిగినా ఈసడింపులేగా?

ఆ... అపురూపాల పిల్లాడికి ఆ గుడ్డలే తక్కువయాయిటే గంగీ.

అని ఓ అమ్మ అంటే చాలు చాల్లే. నీ బతుక్కి అప్పుచేసి గుడ్డలు కొనటం కూడానా? అనియింకొకమ్మ చీదరించింది.

ఆ దొరబాబుకి కొత్త గుడ్డలేకాని పనికి రావుటే చాల్లే యవారం. అని మరొకమ్మ వెక్కిరిస్తే- జరంవస్తే భయమేమిటే కలవరించినంత మాత్రాన చచ్చిపోతాడా యేమిటి? ఊరికే గిజగిజలాడిపోతున్నావు.

మరో కలిగినమ్మ కసుబుసులాడి పోయింది. ధనవంతులందరూ తనను ఎగతాళి చేశారు. కాకిపిల్ల కాకికి ముద్దు. ఎవరి బిడ్డ వారికి అపురూపం కాదూ? జరిగినదంతా తలచుకుంటూ చకచకా యింటికి వచ్చింది గంగి. బట్టలు ముట్టుకుంటూ మురిసిపోయింది.

పొరుగింటి అవ్వ పాక గుంజనానుకుని కునికిపాట్లు పడుతున్నది.

"నాయనారంగన్నా, యిదుగోరా నువ్వు కోరుకున్న లాగూ చొక్కా. ఇవుగో చూసుకోరా రంగా. నీ అమ్మ కొని తెచ్చింది. లేరా బాబూ" పరుగు పరుగున వచ్చి కొడుకు ప్రక్కలో కూర్చుని వాణ్ణి లేపింది గంగి. వాడు కదలలేదు మెదలలేదు. గంగికి అనుమానం కొట్టి ముఖం తిరిగినట్లయిపోయింది. తమాయించుకున్నది. "నాయనా, రంగా" అంటూ వళ్ళు తడిమింది.

"అయ్యో: నా కొడుకా! నాకు దొంగతనం చెయ్యటమే మిగిలించేవురా. కొడుకా." కొయ్యబారిపోయిన కొడుకుపై పడిపోయి తెలివితప్పిపోయింది గంగి. ఆమె చేతుల్లోని ఎర్రలాగూ, తెల్లచొక్కా గాలికి రెపరెపలాడుతూ ఎగిరి ఎగిరి పడుతున్నాయి. ★

## కొత్త రచయిత్రులు



పుట్టింది శ్రీకాకుళం జిల్లాలోని "తుమరాడ" గ్రామం. మెట్టింది అదే జిల్లాలోని "బూరాడపేట" గ్రామం. భర్త ఉద్యోగరీత్యా ప్రస్తుతం వుంటున్నది శ్రీకాకుళం టౌనులో.

"నా మొదటి కథ "పెద్ద గుండె" "ఆంధ్రజ్యోతి" సచిత్ర వారపత్రికద్వారా వెలుగు చూసింది. ఆ వెనుక నా రచనలు "వనిత, తరుణ సినీహెరాల్డ్, చక్రవర్తి, ప్రభవ, స్వాతి, విజయ, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, నివేదిత-పిక్చరీ ఫీల్డ్, తరుణ" పత్రికలలో ప్రచురింపబడ్డాయి.

"ఆంధ్రజ్యోతి" నిర్వహించిన "రంగదీపిక" నాటకముల పోటీలో నా "మనసు చంపేసింది" నాటకం ప్రదర్శనయోగ్యమయిన నాటకంగా యెన్నుకొనబడింది ఆ నాటకాన్ని, "మంచి బొమ్మలు" అను నా యింకో నాటకాన్ని "శ్రీ రామా బుక్ డిపో విజయవాడ" వారు ప్రచురిస్తున్నారు.

ఇప్పటికి అనేక కథలు, నాటికలు, నాటకములు, నవలలు వ్రాశాను.

రావిశాస్త్రి, కుటుంబరావు, రంగనాయకమ్మగార్ల రచనలంటే యిష్టం. వర్ధమాన రచయితలలో యండమూరి వీరేంద్రనాథ్ గారి రచనలంటే యిష్టం

**-యస్. సీతాలక్ష్మినాయుడు**